పాండవులు సంచరించిన నేల..

గొల్లగూడెంలో ఏటా జూన్, జూలైలో పూజలు

- వానలు సమృద్ధిగా కురవాలని వరదపాశం వండి ఆరగింపు
- గుట్టపైకి రహదారి సౌకర్యం కల్పిస్తే పెరగనున్న భక్తులు



పాండవుల ప్రతిమలకు పూజలు చేస్తున్న కులపెద్దలు

ఖమ్మంరూరల్: వేల సంవత్సరాల క్రితం పాండవులు వనవాసం చేసిన సమయంలో మండలంలోని గొల్లగూడెం గ్రామ పొలిమేరల్లో గల గుట్టపై సంచరించారని గ్రామంలోని ఓ తెగకు చెందిన ప్రజలు ఏళ్ల తరబడి పాండవులకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ప్రత్యేకించి ప్రతీ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండి పాడిపంటలతో తులతూగుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని గ్రామస్తులు పాండవుల ప్రతిమలకు ప్రత్యేకంగా పూజలు చేస్తుంటారు. ఈఏడాది కూడా గ్రామానికి చెందిన వారు గుట్టపై చేరి వరదపాశం తయారుచేసి పాండవుల ప్రతిమల వద్ద ఉంచి అనంతరం పెద్దలు ఆరగించి వచ్చిన వారికి పంపిణీ చేశారు. తమ పూర్వీకుల నుండి వందల ఏళ్లుగా ఈ ఆచారం వస్తోందని అందులో భాగంగానే తాము కూడా ఆచారాన్ని పాటిస్తూ పూజలు చేస్తున్నట్లు గ్రామంలోని ఒక తెగకు చెందిన వారు వెల్లడించారు.

గుట్టపైనే పాండవుల నివాసం..

వేల ఏళ్ల క్రితం ఏదైతే పాండవులు అరణ్యవాసం చేశారని పురాణాలు చెబుతున్నాయో ఆ సమయంలో అడవుల్లో తిరుగుతూ గొల్లగూడెం గ్రామ పొలిమేరలోని గుట్టపై కొంత కాలం గడిపారని ఈ తెగ ప్రజలు చెబుతున్నారు. అనంతరం ఈ ప్రదేశం నుండి నేలకొండపల్లి వైపు వెళ్లినట్లు తమ పూర్వీకులు చెప్పారని అప్పటి నుండి తరతరాలుగా పాండవులకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని వారు పేర్కొంటున్నారు. గుట్టపైన పంచపాడవుల ప్రతిమలు ఉంచి ఆ తెగ పెద్దలు నిత్య పూజలు చేస్తున్నారు. అయితే గుట్టపైకి వెళ్లడానికి దారి సరిగా లేదని సీసీ రోడ్డు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

వర్షాలు కురవాలని..

వర్షాలు బాగా కురిసి అందరూ పాడిపంటలతో తులతూగాలని కోరుతూ ప్రతీ ఏడాది జూన్, జూలై నెలల్లో ఆతెగ వారు పాండవులకు ప్రత్యేక పూజలు చేస్తారు. అందరు ఒక దగ్గర చేరి తెగ పెద్దలతో వరదపాశం (బెల్లం, శనగలు, బియ్యంతో తయారు చేసిన) వండి పాడవుల ప్రతిమలకు సమర్పించి అనంతరం అందరూ కలిసి ఆరగిస్తారు. గతంలో అయితే జారుడుబండపై వరద పాశాన్ని పోసి పెద్దలు ఆపాశాన్ని నాలుకతో తీసుకుని తినేవారని చెబుతున్నారు. ఇలా ఎన్నో ఏళ్ల నుండి వస్తున్న ఆచారాన్ని ఇప్పటికీ ఇక్కడ ఆచరిస్తుండటం గమనార్హం.



గుట్టపైకి వెళ్లే మార్గంలో చెట్లు

ఏటా వరద పాశం సమర్పిస్తాం



తరతరాలుగా ప్రతీ ఏటా ఈసీజన్‌లో వర్షాలు బాగా కురిసి అందరూ పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ పాండవులకు వరదపాశం తయారు చేసి సమర్పిస్తాం. అనంతరం అందరం మూకుమ్మడిగా కలిసి వరదపాశాన్ని ఆరగిస్తాం.

– గణపారపు రఘురాం, గొల్లగూడెం

పాండవులు ఇక్కడే ఉన్నారు..



పాండవులు వనవాసం సమయంలో ఇక్కడ కొంతకాలం గడిపారని తమ పూర్వీకులు చెబుతుండేవారు. పాండవులు ఇక్కడ గడిపినందుకు గర్తుగా అప్పట్లో తమ పెద్దలు పాండవులకు పూజలు చేయడం మొదలుపెట్టారు. ఇక ఆనాటి నుండి ఇప్పటి వరకు పూజలు చేస్తూనే ఉన్నాం.

– యాట వీరస్వామి

సీసీ రహదారి సౌకర్యం కల్పించాలి



పాండవులు నివసించిన గుట్టపై ప్రాంతానికి వెళ్లాలంటే రహదారి సౌకర్యం లేదు. రాళ్లు, రప్పలు, చెట్లు అడ్డుగా ఉండి సరిగా రహదారి లేదు. కాబట్టి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కల్పించుకుని గుట్టపైకి రహదారి సౌకర్యం కల్పించాలి.

– నల్లా మునేష్

క్లుప్తంగా

పార్కింగ్ స్థలాన్ని కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ కమ్యూనిటీ హాల్‌కి వచ్చే వారికి పార్కింగ్ సమస్య లేకుండా చూడాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాస్, కొణిదన శ్రీనివాసరావులు కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న ప్రతీ కార్యక్రమానికి తీవ్రమైన పార్కింగ్ సమస్య ఏర్పడుతుందని, సమీపంలో పార్కింగ్ స్థలాన్ని కేటాయించటం ద్వారా రహదారిపై ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శి గంవరపు బాలకృష్ణ, నాయకులు దుర్గాప్రసాద్, ప్రభాకరాచారి, ఆంజనేయులు, కరణ్‌సింగ్, శ్రీనివాస్, రుక్మారావు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



రామచందర్‌రావును సన్మానిస్తున్న శ్రీను

కామేపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రామచందర్‌రావును మద్దులపల్లి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాలె శ్రీనుయాదవ్ శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా శాలువాకప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బ్యాగులు, షూస్ పంపిణీ



షూస్ పంపిణీ చేస్తున్న చైర్మన్ శరత్‌బాబు

ఖమ్మంలీగల్: నగరంలోని డీడీఎల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శరత్ బాబు కాజీపుర హైస్కూల్‌లోని విద్యార్థులకు శనివారం స్కూల్ బ్యాగులు, షూలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నిర్మల, న్యాయవాదులు తవణం శేఖర్ రెడ్డి, జమ్ముల శరత్ కుమార్ రెడ్డి, బిజ్జాల జగన్ మోహన్‌రావు, కటకం ఉమా తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఖమ్మంరూరల్: ఏదులాపురం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం పెదతండాలోని కిసాన్ కన్వెన్షన్ రిలయన్స్ మార్ట్ వద్ద ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్, వై.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ పూర్తికాల కమిటీని ఎన్నుకోటానికి ఏర్పాటు చేస్తున్నామని, ఉద్యోగులందరూ సమావేశానికి హాజరై పలు సూచనలు చేయాలని పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	తమ్ముడు
వినోద	జురాసిక్ వరల్డ్
సాయిరాం	ఓ భామా అయ్యో రామ
ఆదిత్య	సూపర్ మ్యాన్
శ్రీనివాస	కుబేర

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	80		20
కాకర	66	చుక్కకూర	3
బోడ కాకర	280		20
బీర	46	తోటకూర	4
దొండ	38		20
పొట్లకాయ	40	గోంగూర	4
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	56	మెంతికూర	3
క్యాబేజీ	26		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	36	పుదీన	1
క్యారెట్	48		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

కేఎంసీ సమాచారం..

డంపింగ్‌యార్డ్ నిర్వహణ సక్రమంగా జరగాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: డంపింగ్‌యార్డ్ నిర్వహణ సక్రమంగా జరగాలని, వ్యర్థాల కుప్పలను క్రమపద్ధతిలో పోయాలని కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం డంపింగ్‌యార్డ్‌లో బయోమైనింగ్ విధానం, ఖాళీ స్థలంలో మొక్కలు నాటడం, సేకరించిన వ్యర్థాలను డంప్ చేసే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. బయోమైనింగ్ ద్వారా వ్యర్థాలను శుద్ధి చేసేందుకు పనులు వేగవంతం చేయాలని, వ్యర్థాలను శుభ్రం చేసిన తర్వాత ఉన్న ఖాళీ స్థలంలో గుంటలను పూడ్చి స్థలంను ఉపయోగంలోకి తీసుకరావాలని ఆదేశించారు.

వీధి దీపాలు ఏర్పాటు..

నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలను కేఎంసీ సిబ్బంది శనివారం ఏర్పాటు చేశారు. వెలగని వీధి దీపాల స్థానంలో కొత్త వాటిని అమర్చారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో రూ.7 లక్షలతో వీధి దీపాల మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు వంటి పనులను సిబ్బంది చేపట్టారు. ఇక ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై లైటింగ్ ఏర్పాటుకు ఆర్‌అండ్‌బీ, కేఎంసీ ఇంజనీరింగ్ విభాగాల సమన్వయంతో రూ.16.50 లక్షలతో టెండర్‌ను పిలిచారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ఖమ్మంమయూరిసెంటర్: హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని, హామీలు అమలయ్యే వరకు ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. ఈ మేరకు శనివారం సీపీఎం ఖమ్మం వన్‌టౌన్, టూ టౌన్ కమిటీల ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగే రాజకీయ శిక్షణా తరగతులు పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను నాయకుడు సుబ్రహ్మణ్యం కుమార్ ఆవిష్కరించగా ఈ తరగతులకు ప్రిన్సిపాల్‌గా టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ వ్యవహరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, వన్, టూ టౌన్ కార్యదర్శులు నాగులమీరా, బోడపట్ల సుదర్శన్, నల్లా రమేష్, బేగం, భద్రం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

తిరుమలాయపాలెం: మండలంలోని రాజారాం గ్రామంలో పలు పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. ఈ మేరకు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, నాయకులు గంద్ర గోపాల్‌రావు, రాజీవ్, నాగరాజు, మల్లయ్య, నాగయ్య, సైదులు, బక్కయ్య, వీరన్న, వెంకన్న, చంద్రారెడ్డి, చెన్నారెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్లు, రుణాలివ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస రుణాలివ్వాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపాటి మనోహర్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లాస్థాయి సామాజిక శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ కమిటీలు అర్హులకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయించి నిజమైన పేదలకు అన్యాయం చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు ఇందిరమ్మ ఇళ్లపై మరోసారి సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, పాపిట్ల సత్యనారాయణ, కొమ్ము శ్రీను, కర్లకుంట నరేష్, నాగేశ్వరరావు, కొలికపోగు సర్వేశ్వరరావు, నోముల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్లు డిపోలపై పర్యవేక్షణ చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలో వున్న రెండు కల్లు డిపోలపై అధికారులు పర్యవేక్షణ చేసి ముందుస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సరితా క్లినిక్ సెంటర్‌ని కల్లు దుకాణాన్ని పార్టీ టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలో అధికారులు మొక్కుబడి పరిశీలనలు చేయడం, అప్పుడప్పుడు మాత్రమే తనిఖీలు చేయడం చేస్తున్నారన్నారు. పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు భద్రం, నాగేశ్వరరావు, హుస్సేన్, వాసు, మల్లికార్జున్ రెడ్డి, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మెహందీ వేడుకలు



ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలలోని శనివారం మెహందీ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీధర్‌రావు, కృష్ణవేణిలు తెలిపారు. పీవీఆర్ మురళీ మోహన్ ఉపాధ్యాయులు ఉన్నారు.

టూర్ ప్యాకేజీల కింద ఆర్టీసీ బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: భక్తుల సౌకర్యార్థం ఖమ్మం ఆర్టీసీ డిపో నుంచి టూర్ ప్యాకేజీల కింద డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు ఖమ్మం డీఎం దినేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ శుక్రవారం ఉదయం 4:00కు ఖమ్మం నుంచి ఒక బస్సు బయలుదేరి వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి, పెనుగొండ కన్యకా పరమేశ్వరి, ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాల దర్శనం అనంతరం ఖమ్మం చేరుకుంటుందన్నారు. ఒక్కరికి చార్జీ రూ.850 ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రతీ ఆదివారం ఖమ్మం బస్టాండ్ నుండి బస్సు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆ తరువాత స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనంతో తిరుగు ప్రయాణం చార్జి ఒక్కరికి రూ.700 ఉంటుందన్నారు. ఈ బస్సులకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, టిక్కెట్లు ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని టికెట్ రిజర్వేషన్ కౌంటర్ నందు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9959225979, 9959225965, 9959225958, 7382858084 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎన్నికలపై అవగాహన



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఆర్‌ఆర్ స్కూల్‌లో పోలింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరం శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్స్ టీఎల్ఎన్ శర్మ, అర్జున్, ఇన్‌చార్జి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

'కొలాస్ కోట' ప్రారంభం



క్లాప్ కొడుతున్న ప్రొడ్యూసర్ డీఎస్ రెడ్డి

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరానికి చెందిన ఫణిశర్మ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'కొలాస్ కోట' చిత్రానికి తొలిక్లాప్, పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ మేరకు సినీ ప్రొడ్యూసర్ డీఎస్ రెడ్డి చేతుల మీదుగా తొలి క్లాప్ కొట్టించారు. ఈ సినిమాలో హీరో హీరోయిన్లుగా పీసుపాటి భరద్వాజ, హరి మమత నటిస్తుండగా డాక్టర్ మాదాల నాగూర్ అద్వైత క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు.

'వనజీవి' స్ఫూర్తితో మొక్కలు నాటాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి, తదితరులు

ఖమ్మంరూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం జీవితాంతం పాటుపడిన పద్మశ్రీ వనజీవి రామయ్య స్ఫూర్తితో అందరూ మొక్కలు నాటాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. 'విత్తనం నుండి మహావృక్షంగా... వనజీవి జీవితం' పేరిట జిల్లా నరేష్ రచించిన రామయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపునకు అహర్నిశలు పాటుపడిన రామయ్య ఖమ్మం జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్‌తో పాటు నిడిగొండ నరేష్ కుమార్, నూకల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం చేకూరుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని పక్కాగా అమలు చేస్తుందని, కాంగ్రెస్ హయాంలోనే పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎన్ని కుట్రలు పన్నిన కాంగ్రెస్ పార్టీ 42శాతం బీసీల రిజర్వేషన్ అమలు చేసి తీరుతుందన్నారు. పార్టీ బలోపేతం కోసం పని చేయాలని, పని చేసిన వారికే గుర్తింపు లభిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, ఆరెం రవి, మద్దినేని రమేశ్‌బాబు, నల్లమోతు లక్ష్మయ్య, రెడబోతు గోపిరెడ్డి, దామోదర్‌రెడ్డి, గాదె రాంబాబు, అజ్మీరా లక్ష్మణ్, రాందాస్‌నాయక్, దొడ్డ వేణు, కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, నాగేంద్రబాబు, ధరావత్ అనురాధ, దేవండ్ల నాగేశ్వరరావు, రాయల నవీన్ పాల్గొన్నారు.

హామీల అమలుపై కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తాం..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ పార్టీతో మిత్రుత్వం ఉన్నా ప్రజలకిచ్చిన హామీల అమలుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రశ్నిస్తామని, మానవ మనుగడ ఉన్నంత వరకు కమ్యునిజం ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మండలంలోని కొక్కిరేణి గ్రామంలో జరిగిన పార్టీ మండల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ మెరుగైన పాలన అందిస్తుందన్నారు. ఈ ప్రాంతంలో కొక్కిరేణి గ్రామానికి చెందిన చావా వెంకటేశ్వరరావు సాయుధ తెలంగాణ పోరాటంలో వీరోచితంగా పోరాడి దొరల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత ఆయనకు ఉందని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బత్తుల రాధాకృష్ణ, సహాయ కార్యదర్శిగా చీమ రామకృష్ణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు మహమ్మద్ మౌలానా జిల్లా కమిటీ సమితి సభ్యులు దండి సురేష్, పగిళ్ల వీరభద్రం, దంతాల బాలరాజు, బత్తుల రాధాకృష్ణ, చావా వెంకట్రావు, సోమనపల్లి కమలమ్మ, చీమ రామకృష్ణ, మల్లేపల్లి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చోడును మండలంగా చేయాలి..

బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లాలని కోరుతూ కూనంనేని సాంబశివరావుకు గ్రామ అఖిలపక్షం నాయకులు వినతిపత్రం అందజేశారు. బచ్చోడు మండల ఏర్పాటు ప్రాధాన్యతను, గతంలో మంత్రులు ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. నాయకులు తిమ్మిడి హనుమంతరావు, రేపాకుల శివలింగం, సోమనపల్లి వెంకటేశ్వర్లు, అంగిరేకుల నరసయ్య, గొర్రెపాటి రమేష్, రామకృష్ణ, అనంతచారి, గొర్రెపాటి వీరస్వామి పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ ప్రసాదరావు

తిరుమలాయపాలెం: అక్రమ రవాణా కట్టడికి విధిగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు ఆదేశించారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, విచారణలో వున్న కేసులు తదితర అంశాలను పరిశీలించారు. రిసెప్షన్, పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కూచిపూడి జగదీష్, అదనపు ఎస్సై రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్, అఖిల భారత ఐక్య రైతుసంఘం జాతీయ నాయకులు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్థంతి సభను జయప్రదం చేయాలని పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ కోరారు. ఈ మేరకు పోస్టర్లను శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ నెల 16న ఉదయం 10గంటలకు ఇల్లెందు చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ భవనంలో సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శోభ, ఇమ్మడి వెంకటేశ్వర్లు, లెనిన్ లక్ష్మి, సత్తార్, మక్కా రవీందర్ తదితరులుపాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్థంతి సభను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం వర్థంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శివలింగం, ఏఐపీకే ఎంఎస్ జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, పార్టీ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, వెంకన్న, సరోజిని, నరేష్, సునీత, రాములమ్మ, సత్యం, సతీష్, మల్లయ్య ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తి అనారోగ్యంతో రోడ్డు వెంట పడి ఉండగా గుర్తించిన పోలీసులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి అతను మృతిచెందగా మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో దహన సంస్కారాలు చేశారు.

పత్తికి జీవం..



పిండిప్రోలులో భారీ వర్షంతో పత్తి చేనులో నిలిచిన నీరు

తిరుమలాయపాలెం: కొద్ది రోజులుగా సరైన వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు శనివారం కురిసిన వర్షం పత్తి పంటలకు జీవం పోసిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పత్తి విత్తనాలు నాటిన నాటి నుండి సరైన వర్షాలు లేక పత్తి పంట ఎదుగుదల కూడా సరిగా లేదు. దీంతో భారీ వర్షం ఎంతో ఉపయోగపడిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.